క్లుప్తంగా

బస్సు సర్వీసు కల్పించండి

కలకడ : మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ కోరేవాండపల్లె, మొరంమీదపల్లె, అవులప్పగారిపల్లె గ్రామలకు చెందిన గ్రామస్తులు బుధవారం మదనపల్లె-2 డిపో మేనేజర్‌ను కలిసి బస్సు సర్వీసు నడపాలని వినతిపత్రం అందించనట్లు సర్పంచ్ మంజుల తెలిపారు. మదనపల్లె-2 డిపోకు చెందిన ఆర్టీసి బస్సు మదనపల్లె నుంచి కలకడకు రామాపురం సర్వాసుగా కొనసాగుతుందని, అదే బస్సు సర్వీసును కోరేవాండ్లపల్లె స్టాపింగ్ దగ్గర నుంచి కేవలం 1.5 కిలోమీటర్లు పొడగించినట్లు అయితే దాదాపుగా 700 మంది వరకూ జనాభా ఉన్న మూడు గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలు, గర్భిణులు, ఇతర ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వస్తుందని, విద్యార్థులు బస్సు పాస్ తీసుకున్నా ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తుందని గుర్తు చేశారు. సమస్యపై స్పందించిన డీఎం, కంట్రోలర్‌లు రెండు రోజుల్లో పరిశీలించి ఉన్నతాధికారలకు నివేదిక పంపి అనుమతి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లె రూరల్: బైక్ అదుపు తప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. విజయవాడకు చెందిన వెంకటేశ్వరబాబు (55) అంగళ్లులో ఉంటూ మిట్స్ కాలేజీ హార్టికల్చర్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు .అతనితో పాటు రాజారెడ్డి(53) సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి, తిరిగి అంగళ్లుకు వెళుతుండగా మార్గమధ్యంలోని సర్కారుతోపు వద్ద అకస్మాత్తుగా వాహనానికి అడ్డుగా కుక్కరావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో వెంకటేశ్వరబాబు తీవ్రంగా గాయపడగా, రాజారెడ్డికి స్వల్పగాయాలయ్యాయి.

దుకాణాలపై కూలిన చింతచెట్టు



పీలేరు : స్థానిక కడప రోడ్డు మార్గంలో హైవే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రెండు రోజుల క్రితం గాలి భీభత్సానికి ఓ పెద్ద చింత చెట్టు దుకాణాలపై కూలిపోయింది. టూ వీలర్ మెకానిక్ షెడ్, వినాయకస్వామి విగ్రహాల తయారు చేసే షెడ్లపై చింత చెట్టు పడడంతో బాధితులు తమ పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కోరారు.

ఈఓ మునిరాజకు ఇంక్రిమెంట్ నిలిపివేత

బి.కొత్తకోట: స్థానిక గ్రూపు ఆలయం కార్యనిర్వహణ అధికారి మునిరాజకు ఒక ఇంక్రిమెంట్‌ను నిలిపివేస్తూ దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వు జారీ చేశారని జిల్లా అధికారి విశ్వనాథ్ బుధవారం తెలిపారు. బి.కొత్తకోట సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూముల్లో ఇసుక తరలిపోతున్నా సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఆరోపణలు నమోదయ్యాయి. ఇటీవల ఇసుక తరలిపోవడంపై సహాయ కమీషనర్ విచారణ జరిపారు. దీనితో ఈ చర్య తీసుకున్నారు. అలాగే మునిరాజ పని చేసిన ఆలయాల్లో అవకతవకలపై విచారణ జరుగుతున్నట్టు తెలిసింది.

శివ పార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం: అరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం స్థానిక శివాలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రంకు చెందిన వేద పండితులు విగ్రహ ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి తెలిపారు. ఎస్.శ్రావణి,రోహిత్‌కుమార్, షబ్నా, కవితాదేవిలు ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా ఎస్ఎంఎంఎస్‌కు పి.గిరీష్, పి.శశిధర్, మాధురి,నిఖిల్‌లు ఎంపికై నట్లు తెలిపారు. వీరిని బుధవారం హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదివి పదవ తరగతిలో సత్తా చాటిన పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రంగసముద్రం హైస్కూల్‌లో చదివిన ఎం.మహేష్ శ్రీకాకుళంకు, పీటీఎం తెలుగు హైస్కూల్‌కు చెందిన వి.మాధవి ఇడుపులపాయకు, ఎస్.చందన ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ఎంఈఓ తెలిపారు.

తంబళ్లపల్లె: మండలంలో ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ఎంఈఓ త్యాగరాజు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. మోడల్ స్కూల్ నుండి నవీన్‌కుమార్‌రెడ్డి, వాహిద్, పల్లవి, జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి లావణ్య, హిమబిందు, గోపిదిన్నె పాఠశాల నుంచి జోత్స్నవి, మహాత్మాజ్యోతి రావు పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి యశ్వంత్ ఎంపికయ్యారన్నారు.

దేశ చరిత్రలో ఎమర్జన్సీ ఓ చీకటి అధ్యాయం



కురబలకోటలో సంవిధాన్ హత్య దివస్ ర్యాలీ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

సంవిధాన్ హత్య దివస్‌పై అవగాహన

కురబలకోట: దేశ చరిత్రలో ఎమర్జన్సీ ఓ చీకటి అధ్యాయంగా నిలచిపోయిందని తహసీల్దారు ధనుంజయులు, ఎంపీడీఓ గంగయ్య అన్నారు. బుధవారం రెవెన్యూ, మండల పరిషత్‌తో పాటు వివిధ శాఖల ఉద్యోగుల ఆధ్వర్యంలో కురబలకోటలో సంవిధాన్ హత్య దివస్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమర్జన్సీకి 50 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. ఆ నాటి పాలకులు రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించారన్నారు. ప్రాథమిక హక్కులు, పత్రికా స్వేచ్ఛను హరించారన్నారు. భారీ సంఖ్యలో రాజకీయ నేతలను, సామాజిక వేత్తలు, విద్యార్థులతో పాటు ప్రశ్నించిన పౌరులను జైలుపాలు చేశారన్నారు. ప్రజా స్వామ్య విలువలను, హక్కులను కాలరాయడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితి విధించడంతో దేశంలో అప్పట్లో సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఎమర్జన్సీ రోజులకు గుర్తుగా సంవిదాన్ హత్య దివస్‌గా జరిపినట్లు తెలిపారు.

సబ్ కలెక్టరేట్‌లో సంవిధాన్ హత్య దివస్

మదనపల్లె రూరల్: స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో బుధవారం సంవిధాన్ హత్య దివస్ (రాజ్యాంగ హత్య దినం) కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టరేట్ కార్యాలయం వరకు రెవెన్యూ, మున్సిపాలిటీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ 1975 జూన్ 25న దేశంలో అప్పటి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించిందన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జూన్ 25ను సంవిధాన్ హత్య దివస్‌గా జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. ఎమర్జెన్సీలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృత్తం కాకుండా ప్రజలు తమ బాధ్యతలను గుర్తుఎరగాలన్నారు. ఓటు హక్కుపై చైతన్యం తీసుకురావాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇబ్బందులు పడి జైలుకు వెళ్లినవారు, రాజకీయ సామాన్య ప్రజలు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి సన్మానించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఏఓ నిర్మలాదేవి, డిటీలు వెంకటస్వామి, ఫిరోజ్‌ఖాన్, రాఘవేంద్ర, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, మండల సర్వేయర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మేడికుర్తి పీహెచ్‌సీ తనిఖీ

కలికిరి: మండలంలోని మహల్ సామాజిక ఆరోగ్య కేంద్రం, మేడికుర్తి పీహెచ్‌సీని బుధవారం జిల్లా మలేరియా నివారణ అధికారి ఆర్.రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో మలేరియా నిర్ధారణ పరీక్షలకు సంబంధించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. మలేరియా వ్యతిరేక వారోత్సవాలు, వీబీడీఎస్ గురించి మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధతో మాట్లాడారు. మలేరియా నిర్ధారణ పరీక్షల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మలేరియా నివారణ చర్యలపై ఆసుపత్రికి వచ్చిన రోగులకు సూచించాలన్నారు. ఇప్పటి వరకు చేసిన ల్యాబ్ పరీక్షల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్, హెల్త్ సూపర్వైజర్ సుధాకర్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

– వాల్మీకిపురం మండల పరిధిలోని చింతపర్తి పీహెచ్‌సీని జిల్లా మలేరియా నివారణ అధికారి డా. ఆర్. రామచంద్రారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై వైద్యాధికారిణి జులేఖంబేగంకు సూచనలిచ్చారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్, హెచ్‌హెస్ బావుద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చింతపర్తి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా నివారణాధికారి రామచంద్రారెడ్డి

మహిళల రక్షణ మనందరి బాధ్యత

పీలేరురూరల్ : మహిళల రక్షణ మనందరి బాధ్యత అని శక్తి టీమ్ ఇన్‌చార్జి దశరథ అన్నారు. బుధవారం స్థానిక సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ శక్తి యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ ఆపదలో ఉన్న మహిళలకు చక్కని ఆయుధంగా పని చేస్తోందని తెలిపారు. విద్యార్థులందరూ తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మహిళలను గౌరవించే సంప్రదాయం కుటుంబం నుంచే ప్రారంభం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత, శక్తి టీమ్ సభ్యులు శోభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శక్తి టీమ్ ఇన్‌చార్జి దశరథ

రూ.వెయ్యితో రూ.20 లక్షల ప్రమాద బీమా

కురబలకోట: ఎస్‌బీఐలో ఖాతా ఉన్న వారు వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ.వెయ్యి ప్రీమియం చెల్లిస్తే రూ.20 లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చని అంగళ్లు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రుస్తుం ఖాన్ తెలిపారు. ఎగువకమ్మపల్లెకు చెందిన కె. సునీత ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఈమె అంగళ్లు బ్రాంచ్‌లో వ్యక్తిగత ప్రమాద బీమా కింద ఏడాదికి రూ.వెయ్యి చొప్పున బీమా పాలసీ చేశారు. నామినీ కింద ఈమె భర్త రామ్మోహన్‌కు బుధవారం రూ.20 లక్షల చెక్కును అందజేశారు. అనుకోని ప్రమాదం జరిగితే కుటుంబానికి ఆసరాగా ఉంటుందని బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి చేకూరే ఈ ప్రమాద బీమాను వినియోగించుకోవాలని కోరారు.



చెక్కును అందజేస్తున్న అంగళ్లు బ్రాంచ్ మేనేజర్

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

బి.కొత్తకోట: ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారు, మీ పిల్లల భవిష్యత్తుకు మాది గ్యారంటి అంటూ మండల విద్యాశాఖ అధికారి ఆర్.రెడ్డిశేఖర్ బుధవారం విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని విన్నవించారు. చదువుకు దూరమైన పిల్లలనుజ గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బీసీకాలనీలో ఉంటున్న పేదలు, బలహీ నవర్గాలకు చెందిన పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి చదువుకోవాల్సిన పిల్లలను బడికి దూరం చేయొద్దని కోరారు. చదువుతో ఆర్థిక పరిస్థితులు మారిపోతాయని, తద్వారా సామాజంలో వచ్చే గుర్తింపు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఎస్‌ఓ గాయత్రి, గంగోత్రి, హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

అంగన్‌వాడీలకు మొక్కలు, బ్యాగుల వితరణ

మదనపల్లె రూరల్: మదనపల్లె ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జ్యోతిగంగాధర్ మొక్కలను వితరణగా అందజేశారు. 100 జామ, 100 సపోటా, 100 అరటి మొక్కలను అందించారు. ఈ మొక్కలను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వడం జరిగింది. దీంతో పాటు మదనపల్లె హ్యాండ్‌లూమ్స్ అసోసియేషన్ సభ్యులు ప్రీస్కూల్ విద్యార్థులకు 800 స్కూల్ బ్యాగ్స్ అందజేశారు.



స్కూల్ బ్యాగ్‌లు అందజేస్తున్న హ్యాండ్‌లూమ్స్ అసోసియేషన్ సభ్యులు

నేటి నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్

పీలేరు : మండలంలో గురువారం నుంచి వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని తహసీల్దార్ శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 56 చౌకదుకాణాల పరిధిలో 60 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులందరికీ ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందజేస్తామని చెప్పారు. డీలర్లు పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీటీ విజయ కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఇమ్మానుయేల్



కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా డాక్టర్ ఇమ్మానుయల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యం.వి.కిషోర్‌కుమార్ రెడ్డి తిరుపతి మెడికల్ కళాశాలకు బదిలీకాగా, అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండల ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహించిన డాక్టర్ ఇమ్మానుయల్ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సికి హాజరయ్యే వ్యాధిగ్రస్తులకు ఉత్తమ వైద్యసేవలు అందిస్తామన్నారు., ప్రభుత్వం అందించే ఉచిత టీకాలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించడం జరుగుతుందని, అందరు సహకరించి ఉత్తమ వైద్యసేవలు పొందాలని కోరారు.

శ్రీవీరాంజనేయస్వామికి అమావాస్య పూజలు

రామసముద్రం: మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామికి బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. హాజరైన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు. అమావాస్య సందర్భంగా స్వామివారికి నేతి దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అమావాస్య అలంకరణలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో బుధవారం అమానాస్య సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

ఆధార్ లేని సంచార కుటుంబాలు



తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లిన నాగరత్న

కురబలకోట: ఆధార్ కార్డు వ్యక్తిగత గుర్తింపు. ఇది హక్కు. ప్రతి పనికి ఇది అవసరం ఏర్పడుతోంది. ఆధార్ కార్డు లేని 20 సంచార కుటుంబాల సమస్యను మండలంలోని అంగళ్లు గ్రామం తుమ్మచెట్లపల్లెకు చెందిన చల్లా నాగరత్న బుధవారం స్థానిక తహసీల్దారు ధనుంజయులు దృష్టికి తీసుకెళ్ళారు. వీరు అంగళ్లు వద్ద గుడిసెలు వేసుకుని ఏళ్లుగా సంచార జీవితం సాగిస్తున్నారు. రేషన్‌కార్డులు కూడా లేవు. దీంతో నిత్యావసర సరుకులతోపాటు ఫించన్లు, పక్కా ఇండ్లు, తల్లికి వందన ఇతర ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటున్నారు. చిన్నారులు విద్యావకాశాలకు దూరంగా ఉంటున్నారు. ఎలాంటి ప్రభుత్వ పథకాలు పొందలేక పేదరకంలో మగ్గిపోతున్నారు. వయోజనులకు ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారింది. పిల్లలు మొదలుకుని పెద్దల వరకు ఆధార్ కార్డు లేని వారు ఉన్నారు. వీరి పరిస్థితికి చలించిన అంగళ్లు గ్రామ వార్డు సభ్యులు చల్లా నాగరత్న తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ కార్డు లేనందున చిన్నారులు స్కూల్‌కు కూడా దూరమయ్యారు. దీంతో వీరికి ఆధార్ కార్డులు తీయడానికి తహశీల్దారు వీఆర్వో ఖాదర్ బాషాను ఆదేశించారు. అదే రోజు ఎంపీడీఓ గంగయ్య చొరవతో ఆరు మంది పిల్లలను అంగళ్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. నిస్సహాయుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన చల్లా నాగరత్నను పలువురు అభినందిస్తున్నారు. గుడిసెవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ పటిష్టతకు దిశానిర్దేశం

– సమన్వయకర్త నిస్సార్ అహ్మద్

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తమకు దిశానిర్దేశం చేశారని మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. బుధవారం తాడేపల్లిలో జరిగిన నియోజకవర్గ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం చేపట్టాల్సిన చర్యలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై మార్గదర్శం చేసినట్టు చెప్పారు. ఎన్నికల్లో హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఏడాదికే వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. ఇచ్చిన హామీలను ఇచ్చినట్టుగా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగన్ మార్గదర్శకంలో నియోజకవర్గంలో పార్టీ బలోపేతం దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మధ్య సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇతరా నేతలను కలిసి సమావేశంలో పాల్గొన్నారు.



మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలిసి వెళ్తున్న నిస్సార్ అహ్మద్

దుర్గమ్మ తల్లీ.. చల్లంగా చూడమ్మా

బి.కొత్తకోట: దుర్గమ్మ తల్లి తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలను చల్లంగా చూడమ్మా అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రార్థించారు. బుధవారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులతో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు వెళ్తూ..ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. పూజల అనంతరం ఎమ్మెల్యేకు అర్చకులు ఆశీర్వాదంతో తీర్థప్రసాదాలను అందించారు.



దుర్గమ్మ ఆలయంలో ద్వారకనాథరెడ్డి పూజలు

వంటా వార్పుతో కార్మికుల నిరసన

మదనపల్లె: పట్టణంలో 22 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు బుధవారం కార్యాలయం వద్ద వంటా వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. దీక్షా శిబిరం వద్ద కార్మికులు వంటలు వండాక అక్కడే భోజనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమం చేసినట్టు జేఏసీ నాయకులు పేర్కొన్నారు. నిరసనలు, దీక్షలు కొనసాగిస్తూనే సోమవారం నుంచి పట్టణ ప్రజలకు అందిస్తున్న నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణను నిలిపివేశారు. అయినా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగరాజు, బాబు, బాలకష్ణ, సజాద్, కుమార్ పాల్గొన్నారు.



శిబిరంలో భోజనాలు చేస్తున్న కార్మికులు

గ్రామాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్

రామసముద్రం: మండలంలోని ఎర్రబోయినిపల్లె, శ్రీరాములపల్లిలో బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో రూరల్ సీఐ సత్యనారాయణతో పాటు ఎస్ఐలు , 60 మంది సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమతులు కోసం ప్రతి ఇంటిని సోదా చేసి రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. అందులో అనుమానిత 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు రికార్డులు అన్ని చూపిస్తే వెంటనే అప్పగిస్తామని లేదంటే సీజ్ చేస్తామని సీఐ తెలపడంతో వాటిలో రికార్డులు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు పాల్పకుండా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



ఎర్రబోయినిపల్లెలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మదనపల్లె సిటీ: మాదక ద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారి తీస్తుందని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి అన్నారు. బుధవారం కాలేజీలో నాసా ముక్త్ భారత్ కార్యాక్రమంలో భాగంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల వాడకం, మానసిక శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. తమ జీవితాలను పాడు చేసుకోకూడదన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు వద్దు... ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి చిన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి శైలజ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకుల సంఘ అధ్యక్షులు రాఘవరెడ్డి, అధ్యాపకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలి

కలికిరి: ఎంఆర్‌పీఎస్ నూతన గ్రామ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ డానియల్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న గ్రామ గ్రామాన ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా గ్రామ కమిటీలను నియమించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేష్, అమరాల వెంకటరమణ, మండల ఇన్‌చార్జ్ మంద గురుప్రసాద్, మంద ఆంజినేయులు, శ్రీనివాసులు, రాంబాబు, వెంకటేష్, సునీల్, మహేష్, పద్మ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డానియల్

పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోండి

పీలేరు : పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా ఈ పథకాన్ని విస్తృత స్థాయిలో ప్రచారాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రెండవ సంవత్సరం పూర్తైన విద్యార్థులకు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి విద్యార్థి సుమారు 60 మంది ఇళ్ల ఇంటికి వెళ్లి కరపత్రాన్ని అందజేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, డీవీఎంసీ సభ్యులు బోదేషావలి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తంబళ్లపల్లె: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఉమమహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కురవపల్లె బస్టాపు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు ఇచ్చారు. ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పక వాడాలని, కారు నడిపేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహనాలకు సంబంధింత రికార్డులు కచ్చితంగా ఉండాలన్నారు. మద్యం సేవించి,సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదన్నారు. ఒక వేళ ఎవరైనా ఈ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాని సూచించారు.